PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 210 | సంపుటి 4 | గురువారం | 16-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర

## ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఏఈ...



**హుజూరాబాద్ ఏప్రిల్ 15(ప్రభాత గమనం):** హుజూరాబాద్ మున్సిపల్ ఏఈ సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్గా పట్టుబడ్డారు. బిల్లుల క్లియరెన్స్ కోసం ఏఈ ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు పథకం ప్రకారం దాడులు చేసి సుధాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణ కొనసాగతుంది.







కలెక్టరేట్ గార్డెన్ ప్రాంగణంలో ఎక్కడబడితే అక్కడే వేసిన వాటర్ బాటిల్లు



## కలెక్టరేటా?
# చెత్త డంపింగ్ యార్డా?

- గార్డెన్ చుట్టూ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్లిన మాంసం ముక్కలు!
- పట్టించుకోని అధికారులు..
- అపరిశుభ్రతపై నెటిజన్ల ఆగ్రహం!

**హైదరాబాద్, ప్రభాత గమనం :**

మనం ఇప్పుడు చూస్తున్న ఈ దృశ్యాలు ఏదో రోడ్డు పక్కనో, ఊరు శివార్లలోనో లేక గల్లీలల్లోనో అనుకుంటే పొరపాటే.. ఇవి సాక్షాత్తూ జిల్లా పరిపాలన యంత్రాంగం కొలువై ఉన్న మహబూబాబాద్ కలెక్టరేట్ కార్యాలయ దృశ్యాలు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు, వారు కాసేపు సేదతీరేందుకు అధికారులు ఎంతో ఆర్భాటంగా గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. కానీ నేడు ఆ గార్డెన్ పరిస్థితి చూస్తుంటే ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.


### అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్!

ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడాల్సిన ఈ గార్డెన్, ప్రస్తుతం పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా తాగి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు,దుర్వాసన వెదజల్లుతున్న కుళ్ళిపోయిన మాంసపు వ్యర్థాలు.పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో ఉన్న గార్డెన్ లోకి సేద తీరుదామని అడుగుపెట్టే జనం.. అక్కడి కంపు తట్టుకోలేక వెనుదిరుగుతున్నారు. ఇది కలెక్టరేట్ కార్యాలయమా లేక మున్సిపాలిటీ డంపింగ్ యార్డా? అని బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

### నీరు లేక ఎండుతున్న మొక్కలు

గార్డెన్‌లోని మొక్కలు సైతం నీరు లేక, సరైన పోషణ లేక వాడిపోతున్నాయి. 'మేడమ్ గారు.. జర మా వైపు జర దేఖో" అంటూ ఆ మొక్కలు దీనంగా వేడుకుంటున్నట్లు కనిపిస్తున్నాయి. జిల్లా పరిపాలన సాగే గుండెకాయ లాంటి చోటే ఇంత నిర్లక్ష్యం వహించడంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు."లక్షలు ఖర్చు చేసి గార్డెన్ కడితే సరిపోదు.. దాన్ని నిర్వహించే బాధ్యత ఎవరిది? అధికారులు ఇప్పటికైనా స్పందించి కలెక్టరేట్ గౌరవాన్ని కాపాడాలి. స్థానిక ప్రజల డిమాండ్ ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ 'చెత్త' కంపును వదిలించి, గార్డెన్‌కు పూర్వ వైభవం తీసుకువస్తారో లేదో వేచి చూడాలి.






# ప్రజల మనిషి ఎస్ఐ సాయికుమార్

- శాంతిభద్రతలే లక్ష్యంగా విధుల నిర్వహణ
- ఫ్రెండ్లీ పోలీసింగ్ కు అసలైన నిదర్శనం
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగులు
- ఎస్సై సాయికుమార్ సేవలు ఆదర్శనీయం

గార్ల, ఏప్రిల్ 15, ప్రభాత గమనం :

పోలీసు అంటే కేవలం లాఠీ పట్టుకుని భయపెట్టే వ్యక్తి మాత్రమే కాదు.. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ఒక స్నేహితుడు అని నిరూపిస్తున్నారు గార్ల ఎస్సై సాయికుమార్. పదవి అంటే బాధ్యత మాత్రమే కాదు, సమాజం పట్ల మక్కువ అని చాటుతూ ఆయన చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.రోడ్డు ప్రమాదాల నివారణకు సాయికుమార్ చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. కేవలం జరిమానాలు విధించడంపైనే దృష్టి పెట్టకుండా, వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.నేర రహిత గ్రామమే లక్ష్యంగా ఆయన గ్రామస్థులను సమన్వయం చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో భద్రతా భావం పెరగడమే కాకుండా, దొంగతనాలకు అడ్డుకట్ట పడుతోంది.పోలీస్ స్టేషన్‌కు రావాలంటే భయపడే బాధితుల కోసం, స్వయంగా వారి ఇంటికే వెళ్లి సమస్యలను తెలుసుకోవడం, వారికి భరోసా కల్పించడం సాయికుమార్ శైలి. ముఖ్యంగా కేసుల విచారణలో పారదర్శకత పాటిస్తూ, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చొరవ చూపుతున్నారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవలోనూ ఆయన ముందుంటున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాటసారుల దాహం తీర్చేందుకు పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

"పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిలువెత్తు రూపంగా నిలుస్తున్న సాయికుమార్ సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకం." గ్రామస్థులు మరియు మండల ప్రజలు ఆయన పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిబద్ధత గల అధికారి ఉంటే సమాజంలో మార్పు సాధ్యమని సాయికుమార్ మరోసారి నిరూపిస్తున్నారు.గార్లలో గంజా మత్తు పదార్థాల నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తున్నారు. అక్రమ వ్యాపారం చేసే వారి గుండెల్లో వణుకు పుట్టిస్తున్నారు...ఎస్ఐ సాయికుమార్ సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. సలాం పోలిస్ అంటూ ప్రజలు జేజేలు కొడుతున్నారు.



# ప్రాణ రక్షణకు గ్రామం ముందడుగు

- గంటూరుపల్లిలో హెల్మెట్ తప్పనిసరి నిర్ణయం
- కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా 100 హెల్మెట్ల పంపిణీ
- సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి స్వయంగా హెల్మెట్లు దానం
- ఇతర గ్రామాలకు ఆదర్శంగా గంటూరుపల్లి నిర్ణయం



**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో**

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు హాసన్ పర్తి మండలంలోని గంటూరుపల్లి గ్రామంలో గ్రామ సభ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామంలోని మోటారు వాహనదారులు 100 శాతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని అమలు చేసే భాగంగా కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి గ్రామ ప్రజలకు 100 హెల్మెట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి కూడా స్వయంగా హెల్మెట్లు దానం చేసి రోడ్డు భద్రత పట్ల తన నిబద్ధతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే ముఖ్యమైన రక్షణ సాధనమని ఆయన పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. హాసన్ పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని, పోలీస్ శాఖ తరఫున రోడ్డు భద్రతపై మరింత అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. గ్రామ సర్పంచ్ చల్ల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతే తమ లక్ష్యమని, అందుకే ఈ తీర్మానం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థులు ఈ నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేసి, హెల్మెట్ ధరించడం రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హాసన్ పర్తి ఎస్ఐ దేవేందర్, ఉప సర్పంచ్, పంచాయతీ రాజ్ ఏఈ, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# రోడ్డు నియమాలపై ర్యాలీ..

**కేసముద్రం ఏప్రిల్ 15(ప్రభాత గమనం):**

కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వాటిని నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థులు చిన్న వయస్సు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తులో వారు బాధ్యతాయుత పౌరులుగా మారడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని వంటి ముఖ్యమైన నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు.అలాగే, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు మీద నడిచే వారు, వాహనదారులు ఇద్దరూ పరస్పరం జాగ్రత్తగా ఉండాలని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.



# వడదెబ్బ బాధితులకు సత్వరమే వైద్య చికిత్స

- ప్రతి హాస్పిటల్ లో ప్రత్యేకంగా ఒక బృందం
- ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ
- వేసవి నేపథ్యంలో హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు
- అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల ఏర్పాటు
- అన్ని వార్డులు, వెయిటింగ్ ఏరియాలో మంచినీటి సౌకర్యం
- అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



**హైదరాబాద్ ప్రభాత గమనం:**

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దామోదర్ రాజ నర్సింహ సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లలో తాగు నీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు, వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి బుధవారం సమీక్ష చేశారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎండా కాలం నేపథ్యంలో వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు తీసుకుంటున్న చర్యలను, హాస్పిటళ్లలో అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ల కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. వడ దెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని హాస్పిటల్స్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చేశామని, అవసరమైన మెడిసిన్, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, వారి అటెండెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. పెద్ద హాస్పిటల్స్‌లో ప్రతి బ్లాక్‌లో, ప్రతి ఫ్లోర్‌లో డ్రింకింగ్ వాటర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్ ఆవరణలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున ఉక్కపోత సమస్య ఎక్కువ అవుతున్నదని, ఈ నేపథ్యంలో అవుట్ పేషెంట్లకు, ఇన్‌పేషెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐసీయూలు, అవసరమైన ఇతర వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు రిపేర్ ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలన్నారు.

### అవగాహనతోనే నివారణ సాధ్యం

వడ దెబ్బ నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. హాస్పిటల్స్, బస్ స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసుకుని అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన కంటెంట్‌ను రూపొందించి, ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతి సంవత్సరం ఉపాధి హామి కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. పట్టణాల్లో ఆటోడ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, ఇతర గిగ్ వర్కర్లకు వడ దెబ్బపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

### ఎమర్జన్సీలో డెడికేటెడ్ టీమ్ ఉండాలి:

వడదెబ్బతో అనారోగ్యం పాలైన వారికి చికిత్స అందించేందుకు ఒక బృందాన్ని హాస్పిటల్ ఎమర్జెన్సీ ఏరియాలో సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. పేషెంట్ వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించేలా సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన మెడిసిన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

### జనరేటర్లు సిద్ధంగా ఉండాలి

వేసవిలో గాలిదుమారాలు, ఈదురు గాలులు, అకాల వర్షాల వలన విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంటుందని, ఇలాంటి సమయాల్లో పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా వెంటనే జనరేటర్లు ఆన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు అన్ని హాస్పిటల్స్‌లో జనరేటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. అయితే, వెంటనే వాటి పనితీరును పరిశీలించాలని, అవసరమైన చోట రిపేర్లు, మెయింటనన్స్ చేయించాలని మంత్రి ఆదేశించారు.

### అగ్ని ప్రమాదాల ముప్పు

వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుందని అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. అన్ని హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ఈ నేపథ్యంలో అన్ని హాస్పిటల్స్‌లో పవర్ కేబుల్స్‌ను వెంటనే చెక్ చేయించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట పాత వైర్ల స్థానంలో, కొత్త వైరింగ్ చేయించాలని సూచించారు. హాస్పిటళ్ల లోపల, బయట గుట్కా నమలడం, స్మోకింగ్, డ్రింకింగ్ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని మంత్రి ఆదేశించారు. అన్ని హాస్పిటల్స్‌లో ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. మంటలను ఆర్పే యంత్రాలు సరిపడా ఉన్నాయో, లేవో? చూడాలని.. వాటి ఎక్స్‌పైరీ గడువు తేదీలను సైతం చెక్ చేయాలని ఆదేశించారు. మంటలు ఆర్పే యంత్రాల వినియోగంపై హాస్పిటల్ సిబ్బంది, సెక్యూరిటీకి మరోసారి శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి చేయాల్సిన, చేయకూడని పనుల గురించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీపంలోని ఫైర్ స్టేషన్ అధికారులతో, హాస్పిటల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని, ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు.

### బాధితులకు అండగా ఉండండి.. ప్రజలకు మంత్రి విజ్ఞప్తి:

ఎండలు ముదురుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లినప్పుడు ఎండదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీరు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని, ఎక్కువసేపు ఎండలో ఉండకూడదని సూచించారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది కలిగితే తక్షణమే సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలన్నారు. తమ చుట్టూ ఉన్నవారిలో ఎవరికైనా వడ దెబ్బ తగిలితే, వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు బాధితున్ని తరలించాలని, 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయాలని మంత్రి ప్రజలను కోరారు.

# సురక్షితంగా ఇంటికి చేరుదాం




**విద్యార్థులే రోడ్డు భద్రత దూతలు**

**ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకెన్**

**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అర్రైవ్ అలీవ్ " రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా, ములుగు జిల్లా ఎస్ పి సుధీర్ రాంనాథ్ కేకెన్ ఆధ్వర్యంలో ములుగు మండలంలోని బండారుపల్లి సోషల్ వెల్ఫేర్ స్కూల్ మరియు పస్రా లోని ఎస్ఎస్ గార్డెన్స్ లో మెరిట్ స్కూల్ మరియు సెయింట్ మేరీస్ హై స్కూల్ విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మొత్తం సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, తమ ఇంట్లోని పెద్దలకు, పక్కింటి వారికీ మరియు తమ స్థానిక ప్రాంతాల్లో ని వ్యక్తులకు రోడ్డు భద్రత నియమాల గురించి తెలియజేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, పోలీస్ శాఖ మరియు రవాణా శాఖ మరియు ఇతర శాఖలు సంయుక్తంగా ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని, వారి కుటుంబ సభ్యులు వారి కోసం ఇంట్లో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపకూడదని, సీట్ బెల్ట్ ధరించాలని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

# రంగారెడ్డి టీఆర్పీ శ్రేణుల గర్జన

- ప్రజా క్షేత్రమే మన యుద్ధక్షేత్రం.. ప్రతి ఇంటిపై పార్టీ జెండా ఎగరాలి.!
- ఉమ్మడి జిల్లా ఇన్చార్జి బందారపు నర్సయ్య గౌడ్ పిలుపు..


**హైదరాబాద్ ప్రభాత గమనం:**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లా స్థాయి నాయకుల విస్తృత స్థాయి సమావేశం బుధవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నూతనంగా నియమితులైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి బందారపు నరసయ్య గౌడ్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై కీలక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ ఆశయాలను, ఆదేశాలను ప్రతి ఇంటికి చేరవేసేలా నాయకులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి నుండి గ్రామ, వార్డు స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేయాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. మహిళా శక్తితోనే పార్టీ మరింత ముందుకు వెళ్తుందని, అన్ని కమిటీల్లో వారికి తగిన గుర్తింపునివ్వాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోట్ల వాసుదేవ్, మహిళా అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి , వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్ల వాసుకి, ఉపాధ్యక్షులు పొనుగోటి సందీప్, అధికార ప్రతినిధి శాఖరోళ్ల సురేష్ ముదిరాజ్, యూత్ ప్రెసిడెంట్ శాగంటి శ్రీనివాస్, నాయకులు మద్దెగూడెం జనార్దన్ ముదిరాజ్, బొంగు వేంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ప్రవేశాలు ప్రారంభం..

- ఏప్రిల్ 15 నుంచి మే 14 వరకు తొలి విడత ప్రవేశాలు...




**కేసముద్రం, ఏప్రిల్ 15(ప్రభాత గమనం):**

కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. డి. రాజు తెలిపారు. డిగ్రీ ఆన్‌లైన్ సేవలు తెలంగాణ (దోస్త్) ద్వారా ఈ ప్రవేశాలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, తమ కళాశాలలో బీఏ (కంప్యూటర్స్, జనరల్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్స్), బీఎస్సీ (బీజెడ్‌సీ) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి విభాగంలో 60 సీట్లు ఉండగా, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల దోస్త్ సంకేత సంఖ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేసముద్రం (2673) ద్వారా తొలి విడతలో ఏప్రిల్ 15 నుంచి మే 14 వరకు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు సమయానికి దోస్త్ ద్వారా నమోదు చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది.



# బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- రాష్ట్ర కార్యదర్శి ఆకుల హనుమాండ్లు
- ఇబ్రహీంపట్నంలో ఘనంగా జెండా గద్దె ఆవిష్కరణ..

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 15 (ప్రభాత గమనం) బహుజన బిడ్డల ఆత్మగౌరవానికి జెండా గద్దెలు ప్రతీకలని, బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని రాష్ట్ర కార్యదర్శి ఆకుల హనుమాండ్లు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బుధవారం నాడు జెండా గద్దెను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యువజన రాష్ట్ర అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆకుల హనుమాండ్లు మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న ఆశయాల బాటలో అవినీతి రహిత పాలన కోసం పోరాడాలన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, అణచివేతకు గురవుతున్న వారి గొంతుకగా నిలవడమే మల్లన్న సిద్ధాంతమని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం నుంచి పెద్ద ఎత్తున యువత ఈ ఉద్యమంలోకి రావడం శుభపరిణామమని ఆయన హర్షం వ్యక్తం చేశారు.యువజన రాష్ట్ర అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షులు తిరుపతి, ఇబ్రహీంపట్నం యూత్ సభ్యులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మద్దతు

**యాదాద్రి భువనగిరి, ప్రభాత గమనం:**

తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొంటున్న కార్మికులకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పూర్తి స్థాయి మద్దతు ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా డివిజన్ కార్యాలయం ముందు విద్యుత్ ఆర్టిసన్ కార్మికులు తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటు అయి రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, విద్యుత్ ఆర్టిసన్ కార్మికుల డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవని పేర్కొన్నారు. ఈ సమస్యపై తాను పలుమార్లు "మార్నింగ్ న్యూస్" వేదికగా మాట్లాడినట్టు, అలాగే శాసన మండలిలో కూడా ప్రస్తావించినట్టు గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని నేరుగా కలిసి సమస్య వివరించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచాలంటే సమిష్టిగా పోరాటం చేయాల్సిందేనని, కార్మికుల ప్రతి ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రాబోయే బీసీ ప్రభుత్వంలో విద్యుత్ ఆర్టిసన్ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించే బాధ్యత తనదేనని భరోసా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్థానిక నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎనిమిదో రోజుకు చేరిన విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె

- గార్ల మండలంలో ప్రకటిత విద్యుత్ కోతలు!

**గార్ల, ఏప్రిల్ 15, ప్రభాత గమనం :**

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ 'అన్ మ్యాన్డ్ కట్టర్' (Unmanned Cutters) కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సమ్మె ప్రభావంతో గార్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అప్పుడప్పుడు అంతరాయం కలుగుతోంది.ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు సిరిపంగి నరేష్ మాట్లాడుతూ, గత 15 నుంచి 20 ఏళ్లుగా ప్రాణాలకు తెగించి విద్యుత్ శాఖలో సేవలు అందిస్తున్నా, ప్రభుత్వం తమను గుర్తించకపోవడం దారుణమన్నారు. నిత్యం ప్రమాదకరమైన పరిస్థితుల్లో పని చేస్తున్న తమకు కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ హయాంలో పరిష్కారం కాని సమస్యలను తాము అధికారంలోకి రాగానే తీరుస్తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చిందని కార్మికులు గుర్తు చేశారు. మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.ఆర్టిజన్ కట్టర్లను వెంటనే విద్యుత్ సంస్థలో విలీనం చేయాలి.

### తమను పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

ప్రమాదకర విధుల్లో ఉన్న కార్మికులందరికీ పూర్తిస్థాయి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెనువెంటనే అమలు చేయాలి.న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు వెనక్కి తగ్గేది లేదని కార్మికులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గార్ల సబ్ స్టేషన్‌కు చెందిన ఆపరేటర్లు సిరిపంగి నరేష్, గట్టు యుగంధర్, ఉపేందర్, రవి, జె. నరేష్ తదితర ఏడుగురు ఆర్టిజన్ కట్టర్లు పాల్గొని తమ నిరసనను కొనసాగిస్తున్నారు.

# ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలి

- సమ్మర్ తాగునీటి సరఫరా యాక్షన్ ప్లాన్ ప్రకారం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్...



**మహబూబాబాద్ ఏప్రిల్ 15(ప్రభాత గమనం):**
బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన సమ్మర్ త్రాగునీటి యాక్షన్ ప్లాన్, కనీస వేతనాల అమలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..వేసవి కాలం నేపథ్యంలో జిల్లాలోని ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు యాక్షన్ ప్లాన్ ప్రకారం జిల్లాలోని హ్యాబిటేషన్లను హ్యాండ్ పంపులు సంపులు తదితర త్రాగునీరు అందించే సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.మిషన్ భగీరథ, ఇంట్ర, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ, గ్రామపంచాయతీ, జిల్లా ప్రజా పరిషత్, మున్సిపల్ తదితర ఇంజనీరింగ్ విభాగం త్రాగునీటి సరఫరాలో సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు.సమస్యలు ఉన్నచోట ప్రత్యేక శ్రద్ధ వహించాలని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధంగా ఉండాలని, అవసరం అయితే వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. నేడు నిర్వహించబోయే మండల సభలో గ్రామస్థాయి మండల స్థాయి అధికారులు వాటర్ సప్లై సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.

పట్టణంలోని ప్రధాన విద్యాసంస్థలు, ఆస్పత్రులు కాలేజీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరును అందించాలని మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ మిషన్ భగీరథ సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీలు, మున్సిపల్ పరిధిలలో ఏవైనా తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, స్థానిక వనరుల మేరకు త్రాగునీటిని అందించాలని, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో వివిధ విభాగాలు ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ, బిసి, అంగన్వాడి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, మున్సిపల్, తదితర డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ సిబ్బందికి ప్రభుత్వ, జిఓ, రూల్స్, సూచనల మేరకు వేతనాలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఇంజనీర్ సురేందర్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఈ ఈ లు, ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ శాఖ అధికారులు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, దేశీ రామ్ నాయక్, లేబర్ అధికారి, ఉపాధి కల్పన అధికారి రజిత, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ భూమి పూజ

- రైతు వేదిక వద్ద స్థలం కేటాయింపు..
- హాజరైన సర్పంచ్ బానోత్ పార్వతి హతిరామ్ నాయక్

**గార్ల, ఏప్రిల్ 15, ప్రభాతగమనం :**
గార్ల మండల కేంద్రంలోని అయ్యప్ప భక్తుల దశాబ్దాల కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. గార్ల శ్రీ ధర్మశాస్త్ర పీఠం అయ్యప్ప స్వాముల విన్నపాన్ని మన్నించి, స్థానిక రైతు వేదిక సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆలయ నిర్మాణానికి కేటాయించారు. ఈ మేరకు బుధవారం శుభ ముహూర్తాన ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.గార్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరామ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి నెలకొంటుందని, అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఉప సర్పంచ్ జరీనా బేగం మరియు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగుతున్న భక్తులకు అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. శ్రీ ధర్మశాస్త్ర పీఠం గురుస్వామి వేంపటి దుర్గారావు స్వామి పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం సాగింది. ప్రతి ఏటా మాలధారణ చేసే వందలాది మంది అయ్యప్ప స్వాములు ఈ వేడుకలో పాల్గొని హరిహరసుతుని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, తోడేటి శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరావు, చిన్నబంజారా తండా సర్పంచ్ మోతిలాలు, టౌన్ ప్రెసిడెంట్ పళ్ళ నర్సయ్య, షేక్ యాకుబ్ పాషా, కోలా కుమార్ మరియు ఇతర నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**
రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద అత్యంత విజయవంతంగా జరిగింది. ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ విజయ, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం ప్రకాష్, ఆర్టీవో శోభన్ బాబు తదితర ఉన్నతాధికారులు హాజరై కార్యక్రమానికి ప్రాధాన్యతను చాటారు. అలాగే ఏసీపీ ట్రాఫిక్ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు కోడూరి సుజాత, వెంకన్న, రమేష్, ఎమ్మార్వో ఇక్బాల్ తదితరులు సమన్వయం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే పాఠశాల నుండి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొని భారీ మానవహారం నిర్వహించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. యువత చురుకైన భాగస్వామ్యం కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చింది. ఈ సందర్భంగా అధికారులు "హెల్మెట్ ధరించండి – ప్రాణాలు కాపాడుకోండి" అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ద్విచక్ర వాహన దారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసి భద్రతపై అవగాహన పెంపొందించారు. హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడే ముఖ్యమైన చర్య అని వారు పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ కోడూరి సుజాత మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుంది. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం వంటి అలవాట్లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి" అని తెలిపారు. మొత్తంగా, వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు సురక్షిత ప్రయాణం వైపు ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది.

## పిల్లలకు కూడా హెల్మెట్ అవసరం

- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్

**ప్రభాత గమనం, వరంగల్ జిల్లా క్రైమ్ బ్యూరో :**
మహబూబాబాద్ పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ నుండి అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు రోడ్డు భద్రత పై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు . ఈ ర్యాలీలో తమ పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే తల్లిదండ్రులు, వారి పిల్లలు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై ప్రజలలో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, మాట్లాడుతూ, పిల్లల భద్రత ప్రతి తల్లిదండ్రి యొక్క ప్రథమ బాధ్యత అని తెలిపారు. చిన్న దూరం ప్రయాణం అయినా, "ఇప్పుడు అవసరం లేదు" అనే నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో చెప్పలేమని, హెల్మెట్ ఒక్కటే ప్రాణాలను రక్షించే ప్రధాన భద్రతా సాధనం అని పేర్కొన్నారు. పిల్లలను ముందుగా కూర్చోబెట్టి లేదా వెనుక కూర్చోబెట్టి ప్రయాణించే సమయంలో వారికి సరిపోయే సైజ్ హెల్మెట్ తప్పనిసరిగా పెట్టాలని సూచించారు. హెల్మెట్ సరైన విధంగా బిగించి పెట్టకపోతే ఉపయోగం ఉండదని, కాబట్టి సరిగ్గా ధరించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అలాగే, ఒక్క కుటుంబం మాత్రమే కాకుండా సమాజం మొత్తం ఈ నియమాన్ని పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించమని గుర్తు చేయడం ద్వారా మంచి మార్పు తీసుకురాగలరని, రోడ్డు భద్రత కుటుంబ స్థాయి నుంచే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వేగ పరిమితులు పాటించడం, ట్రిపుల్ రైడింగ్ నివారించడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం వంటి అంశాలు కూడా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కీలకమని వివరించారు. ప్రతి తల్లిదండ్రి తమకు మాత్రమే కాకుండా తమ పిల్లలకు కూడా హెల్మెట్ పెట్టి ప్రయాణించడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని, ఇతరులకు ఆదర్శంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు.






## మున్నేరు తీరంలో వరి సిరులు

- తడులు అందిస్తేనే గింజ గట్టిపడే అవకాశం!
- రైతులకు ఏవో రామారావు భరోసా..
- ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తామని వెల్లడి

**గార్ల/రాంపురం, ప్రభాత గమనం :**
మున్నేరు పరివాహక ప్రాంతంలోని గార్ల, రాంపురం గ్రామాల్లో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కీలక దశకు చేరుకుంది. బుధవారం మండల వ్యవసాయ అధికారి (ఏవో) కె. రామారావు క్షేత్రస్థాయిలో పర్యటించి, వరి చేలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంట స్థితిగతులు దిగుబడి అంచనాలపై పలు సూచనలు చేశారు. పంట ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉందని, వరి కోతకు రావడానికి మరో 20 రోజుల సమయం పడుతుందని రామారావు వివరించారు. ఈ చివరి 20 రోజులు పంటకు ఎంతో కీలకమని, సరైన పోషణ అందితేనే గింజ నాణ్యతగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.పంట ఆఖరి దశలో ఉన్న తరుణంలో పొలాలు ఎండిపోతుండటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఏవో, ప్రస్తుతం పంటకు కనీసం ఒకటి లేదా రెండు తడుల నీరు అత్యవసరమని స్పష్టం చేశారు. నీటి సరఫరా సక్రమంగా ఉంటేనే దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.పంటను కాపాడుకునేందుకు సాగునీటి విడుదలపై రైతుల విన్నపాన్ని సానుకూలంగా తీసుకున్న ఏవో రామారావు, తక్షణమే ఈ విషయాన్ని జిల్లా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## పోలీసులు వేధిస్తున్నారు..

**వరంగల్, ప్రభాతగమనం :**
మామునూరు ఏసీపీ, ఎనుమాముల సీఐ, ఎస్ఐ తనను వేధిస్తున్నారని వరంగల్ జిల్లా దేశాయిపేటలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన భర్తను అరెస్టు చేసి 12 రోజులుగా ఆచూకీ చెప్పడం లేదని, తనను కూడా వేధిస్తున్నారని మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో ఆ మహిళను కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రిక తరలించి చికిత్స నందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ మీడియాతో మాట్లాడుతూ.. నేను ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి ఏసీపీ, సీఐ, ఎస్ఐలే కారణమని చెప్పింది. పోలీసులు తన భర్తను అక్రమ కేసులో అరెస్టు చేసి, 12 రోజులుగా ఆచూకీ తెలియజేయడంలేదని బాధిత మహిళ ఆరోపిస్తోంది. ఈ ఘటనకు సంబంధించి మరిన్నివివరాలు తెలియాల్సి ఉంది.

## అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

**అడిషనల్ డీజీపీ మహేశ్ ఎం భగవత్**

హైదరాబాద్, ఏప్రిల్ 15 ప్రభాత గమనం : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒకరూ అప్రమత్తంగా ఉండాలని శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మహేశ్ ఎం భగవత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం డీజీపీ కార్యాలయంలో అగ్నిమాపక శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబర్‌కు సమాచారం అందించి, భవనాన్ని ఖాళీ చేయించాలని సూచించారు.

## వడగాలులపై అప్రమత్తంగా ఉండండి

**హైదరాబాద్, ఏప్రిల్ 15(ప్రభాత గమనం) :**
రాష్ట్రంలో వడగాలులు, ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం కలెక్టర్లకు అత్యవసర సూచనలు చేసింది. హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని, తాజా పరిస్థితులకు అనుగుణంగా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సూచించింది. ప్రధాన కూడళ్లు, జనసమర్థ ప్రదేశాల్లో కూలింగ్ సెంటర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరింది. రెడ్‌క్రాస్, ఎన్జీవోలు, సామాజిక సంస్థలతో కలిసి పనిచేయాలని ఆదేశించింది. వడగాలుల కారణంగా మరణాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరింది.



## బీఆర్ఎస్ యువ నాయకుడి జన్మదిన వేడుకలు

నెక్కొండ ఏప్రిల్ 15(ప్రభాత గమనం):మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువ నాయకుడి జన్మదిన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. నెక్కొండ మాజీ ఎంపీపీ, తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు గటిక అజయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి గోపగాని శ్రీకాంత్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివ కుమార్, పత్తిపాక మాజీ సర్పంచ్ ఎంపీటీసీ బొల్లెబోయిన వీరస్వామి యాదవ్, అప్పలరావుపేట మాజీ సర్పంచ్ వడ్డే సురేష్, మాజీ ఉప సర్పంచ్ వీరభద్రయ్య, నాయకులు కారింగుల సురేష్, సూలం సారయ్య, మురళి గౌడ్, సుభాష్ గౌడ్, ప్రభాకర్, శ్రీనాథ్ గౌడ్, శ్రవణ్, అక్కెనపెల్లి నవీన్ కుమార్, సుభాష్, సంపత్, అభి, వినోద్ తదితరులు పాల్గొన్నారు

# మన ఊరు.. మన భద్రత.. మన బాధ్యత

- భూపాలపల్లి ఎస్పీ సిరి శెట్టి సంకిర్త్ కుమార్
- జిల్లా కేంద్రంలో సర్పంచులకు, కౌన్సిలర్లకు అవగాహన కార్యక్రమం
- రోడ్డు భద్రత, నేరాల నివారణపై ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ





**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలీవ్ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచులకు, కౌన్సిలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ నియంత్రణ మరియు సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రాష్ట్రంలో యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, నేరాల నివారణపై సర్పంచులు మరియు ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. యువతలో సానుకూల మార్పు తీసుకురావడంలో గ్రామ స్థాయి నాయకత్వం కీలకమని పేర్కొంటూ, సర్పంచులు ముందుండి యువతను సరైన దిశలో నడిపించాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న వారి వివరాలను పోలీసులకు తెలియజేసి సమాజాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని కోరారు.అదేవిధంగా, నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి గ్రామంలో వాటి ఏర్పాటు కోసం ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు పాల్గొన్నారు.

# కుప్పలు, తెప్పలుగా అప్పులు చేస్తున్న
# రేవంత్ ను నిలదీయాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

మేడ్చల్, ప్రభాత గమనం : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బద్నాం చేయడానికి కుప్పలు, తెప్పలుగా అప్పులు( Debt ) చేస్తున్న రేవంత్ రెడ్డిని నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ( KCR ) పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో పలువురు కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు ( Congress Councillors ) బీఆర్ఎస్ ( BRS ) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర యేండ్ల కాలం అయిందని, ఎన్నికల ముందు అడ్డగోలుగా ఇచ్చిన హామీలు ఇంకా నేరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ హామీలతో గ్రామాల్లో అమాయక ప్రజలు నమ్మి మోసపోయారని, తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మలేదని, ఒక్క సీటు కూడా కాంగ్రెస్ గెలవలేక పోయిందని పేర్కొన్నారు.



### హైదరాబాద్‌లో దొంగలే సంతోషంగా ఉన్నారు..

ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగ పిల్లవాడు పుడితే రూ.12వేలు ఇచ్చి తల్లి బిడ్డను ఇంటి దగ్గర దించి వచ్చేలా అనాడు కేసీఆర్ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. రేవంత్ పాలనలో అనేక కార్యక్రమాలు రద్దయ్యాయని వివరించారు. హైదరాబాద్ లో ఎవరైనా సంతోషంగా ఉన్నారంటే ఇద్దరే ఇద్దరు సంతోషంగా ఉన్నారు. ఒక్కరు దొంగలు, మరొక్కరు దోమలు. హైదరాబాద్‌లో ఎక్కడబడితే అక్కడ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరోపక్క ముఖ్యమంత్రి భూములు కబ్జాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉప్పల్ ఫ్లై ఓవర్ భూమి పుట్టినప్పటి నుంచి నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్ట్ 8 ఏండ్లు అయింది. ఎక్కడ పని అక్కడే ఉందని ఆరోపించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మూడుకు మూడు క్లీన్ స్వీప్ చేశారని, మరోసారి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ గెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ బుల్డోజర్ వస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్, జక్కా వెంకట్ రెడ్డి , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని
## గడువులోగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హనుమకొండ, ప్రభాతగమనం :**

ఉపాధి హామీ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన ఉపాధి హామీ పనుల ప్రగతిపై డిఆర్డిఏ అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పన, పనుల పురోగతి, లక్ష్య సాధనపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ, జిల్లాకు మూడు లక్షల అరవై ఐదు వేల పని దినాల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు సుమారు డెబ్బై వేల పని దినాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేసే విధంగా పనులను వేగవంతం చేయాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులను ఉదయం 5 గంటల నుంచి 11 గంటల మధ్య నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీలకు సౌకర్యవంతమైన వాతావరణంలో పనులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో అధిక సంఖ్యలో కూలీలను భాగస్వామ్యం చేసినందుకు ఎర్రబెల్లి గ్రామానికి చెందిన సీనియర్ మేట్‌ను కలెక్టర్ శాలువాతో సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, డిఆర్డిఏ ఏవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ జరిగితే..
## ఎన్నికల్లో పోటీ చేస్తా..

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**నీలగిరి, ఏప్రిల్ 15, ప్రభాత గమనం :**

జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, దీంతో ఉన్న సీట్లకు 50 శాతం పెంచేలా కేంద్రం కొత్త విధానం ప్రతిపాదించిందని, 50 శాతం జనాభా, 50 శాతం జీఎస్టీ పరంగా చేయాలని పలు రాష్ట్రాలు ప్రతిపాదిస్తున్నాయని, ఇది సాధ్యం కాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలీ ఎన్నికలు నిర్వహించడమే మంచిదని, తొలి విడతగా దేశంలో 18 రాష్ట్రాల్లో జమిలీ ఎన్నికలు జరుగుతాయన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ఒకేసారి జరిగాయని, ఆ పద్ధతిలో ఎన్నికలు జరిగితే సమస్యలు ఉండవని, కానీ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు వేర్వేరుగా నిర్వహించడం వల్ల పరిస్థితులు మారుతున్నాయన్నారు. ముఖ్యంగా ఓటర్లు అభివృద్ధి చూసి ఓట్లు వేయడం లేదని, పైసలు పైసలే.. ఓట్లు ఓట్లే అన్నట్టు చూస్తున్నారని, ప్రజల్లో కూడా మార్పు రావాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు.



# మరో మూడేండ్లు ఎల్పీజీ కష్టాలు?

- యుద్ధం ముగిసినా భారత్ కు తప్పని తిప్పలు
- గ్యాస్ అవసరాల్లో 60 శాతం దిగుమతిపైనే ఆధారం
- అందులో 92% పశ్చిమాసియా దేశాల నుంచే

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15, ప్రభాత గమనం**

: ప్రజలు మళ్లీ కట్టెల పొయ్యిలు, కుంపట్లు, కిరోసిన్ స్టవ్‌లను ఆశ్రయించాల్సిందేనా? లేక ఎలక్ట్రిక్, ఇండక్షన్ స్టవ్‌లు, వంటింట్లోకి చేర్చాల్సిందేనా? రానున్న రోజుల్లో ఇటువంటి పరిస్థితులు అందరూ కచ్చితంగా ఎదుర్కోవాల్సిందేనా? అంటే అవునని అనిపిస్తున్నది. ఎందుకంటే ఎల్పీజీ సంక్షోభం మరింత ముదరనున్నది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచమంతటిపై పడింది. ముఖ్యంగా ప్రతి వంట ఇంటికి అవసరమైన ఎల్పీజీ సరఫరా చెయిన్‌కు యుద్ధం కారణంగా తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీనిని పునరుద్ధరించడానికి మూడు నుంచి నాలుగేండ్లు పట్టవచ్చునని భావిస్తున్నారు. ఎల్పీజీ సంక్షోభం లేదని అనుకుంటున్న వారికి నిజంగా ఇది పిడుగులాంటి వార్తే. యుద్ధం ముగిసినా, ముగియకున్నా ప్రపంచ ప్రజలైతే దీని దుష్పరిణామాలు ఎదుర్కోక తప్పదు. యుద్ధం కారణంగా ఎల్పీజీ సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయిందా లేక శాశ్వతంగా దెబ్బతిని ఆగిపోయిందా అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



### ఎల్పీజీ సరఫరాకు పశ్చిమాసియాపైనే ఆధారం

ఎల్పీజీ సరఫరాలపై భారత్ ఎక్కువగా పశ్చిమాసియాపై ఆధారపడి ఉంది. అయితే అమెరికా–ఇరాన్ యుద్ధంలో ఎనర్జీ మౌలిక సదుపాయాలపై ఇరాన్ దాడులు చేసి నష్టం కలిగించడంతో పాటు హొర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఎల్పీజీ రవాణా ఎక్కడికక్కడే ఆగిపోయింది. ఎల్పీజీ సరఫరాదారుల నుంచి అందుతున్న ప్రాథమిక సమాచారం ప్రకారం ఎల్పీజీ సరఫరా పునరుద్ధరణకు కనీసం మూడేండ్లు పడుతుంది. ఇది ఇంకా దీర్ఘకాలం కొనసాగే అవకాశం కూడా ఉంది. దీని కారణంగా భారత్ దిగుమతి నష్టాలను ఎదుర్కోవడంతో పాటు వ్యయ ఒత్తిడిని ఎదుర్కోక తప్పదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. మన దేశీయ ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతి ద్వారానే సమకూర్చుకుంటున్నది. ఎల్పీజీలో 90 శాతం హొర్ముజ్ జలసంధి మీదుగానే భారత్‌కు దిగుమతి అవుతున్నది. అయితే ఆ దారిని మూసివేయడంతో పూర్తి స్థాయిలో ఎల్పీజీ సరఫరా జరగడం లేదు.

# భర్తను హత్య చేసిన భార్య

- కట్టుకున్నవాడి హత్యకు పన్నాగం
- పరకాలలో సినిమాను తలపించే ఘోరం
- అక్రమ సంబంధం నేపథ్యంలో దారుణం

**ప్రభాత గమనం, పరకాల:**

పరకాల పట్టణంలో సినీ కథను తలపించే విధంగా భార్య చేత భర్త హత్యకు గురైన ఘటన వెలుగులోకి రావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. సీఎస్ఐ కాలనీకి చెందిన మడికొండ సుమన్ (30) ట్రాక్టర్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య లావణ్యకు నరేష్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో మార్చి 3న సుమన్‌ను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన లావణ్య, మరుసటి రోజు అతని సెల్‌ఫోన్ ద్వారా బ్రతికున్నట్లు స్టేటస్ పెట్టినట్లు సమాచారం. అయితే మార్చి 6న ఏమి తెలియనట్లుగా ఇంటికి చేరుకోవడంతో మృతుడి తండ్రి సాంబయ్యకు అనుమానం కలిగింది. దీంతో మార్చి 8న పరకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా సుమన్‌పై రెండు సార్లు హత్యాయత్నాలు జరిగి విఫలమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చివరగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చలువాయి గ్రామ పరిసర ప్రాంతంలో హత్య జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టగా, బుధవారం లావణ్య తన భర్తను హత్య చేసినట్లు ఒప్పుకున్నట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆమె ప్రియుడు నరేష్, తమ్ముడు రాజు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన పరకాలలో చర్చనీయాంశంగా మారగా, మృతుడి బంధువులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసును మరింత లోతుగా విచారిస్తున్నారు.





## బీహార్ సీఎంగా
## సమ్రాట్ చౌదరి ప్రమాణం

- హాజరైన మాజీ సీఎం నితీశ్ కుమార్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, చిరాగ్ పాశ్వాన్

**పాట్నా, ప్రభాత గమనం :**

బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బీజేపీకి చెందిన సమ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ సయ్యద్ అత్ హస్నైన్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం, జేడీ (యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, చిరాగ్ పాశ్వాన్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సమ్రాట్ చౌదరికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ పట్ల ఆయన అంకిత భావం, క్షేత్రస్థాయి అనుభవం రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాగా, ఇద్దరు జేడీ(యూ) నేతలు ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టవచ్చునని భావిస్తున్నారు. ఈ రోజు నుంచే తాను పనిలోకి దిగుతానని, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీఎం నితీశ్ కుమార్ అభివృద్ధి చేసినా పాలనా విధానాలను రాష్ట్రంలో అనుసరిస్తానని చౌదరి మీడియా సమావేశంలో పేర్కొన్నారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## మా విషయాల్లో జోక్యం చేసుకోవద్దు

- అమెరికాకు చైనా స్ట్రాంగ్ వార్నింగ్
- ఇరాన్ తో తమ విషయాల్లో జోక్యం చేసుకోవద్దంటూ సూచన
- ప్రపంచ శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉంటామని స్పష్టం

**ఢిల్లీ, ప్రభాత గమనం:**

ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ముదురుతున్న వేళ.. యూఎస్, చైనాల మధ్య కూడా దౌత్య యుద్ధం పతాక స్థాయికి చేరింది. ఇరాన్‌తో తమకున్న ద్వైపాక్షిక సంబంధాల విషయంలో అమెరికా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ చైనా ఘాటు హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టిన డ్రాగన్ దేశం.. తమ వాణిజ్య ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఊరుకోబోమని స్పష్టం చేసింది.



### ఇరాన్, చైనా బంధంపై జోక్యం చేసుకోవద్దు..

చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్ ఈ ఉదంతంపై గట్టిగా స్పందించారు. ప్రపంచ శాంతి, స్థిరత్వానికి బీజింగ్ కట్టుబడి ఉందని చెబుతూనే.. పశ్చిమాసియా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌తో చైనాకు ఉన్న వాణిజ్య, ఇంధన ఒప్పందాలు అత్యంత కీలకమని.. వాటిని తాము గౌరవిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. "ఈ వ్యవహారాల్లో మూడో పక్షం (అమెరికా) జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. మా దౌత్య సంబంధాలు మా ఇష్టం" అంటూ డాంగ్ జున్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### ఇరాన్ నియంత్రణలోనే.. హార్మూజ్ జలసంధి

హార్మూజ్ జలసంధిపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు చైనా నౌకలకు వర్తించబోవని అడ్మిరల్ స్పష్టం చేశారు. ఈ జలసంధి ఇరాన్ నియంత్రణలోనే ఉందని.. చైనా నౌకల రాకపోకలకు అది ఎప్పటికీ తెరిచే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం హార్మూజ్ జలసంధిలో చైనా నౌకల కార్యకలాపాలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయని.. భవిష్యత్తులోనూ ఇదే పరిస్థితి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. చైనా విదేశాంగ శాఖ కూడా దీనిపై స్పందిస్తూ.. అంతర్జాతీయ నౌకా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలగకూడదని, యుద్ధం ముగించేలా చర్యలు ఉండాలని కోరింది. అమెరికా తన నౌకాదళ శక్తితో ఇరాన్ చమురు రవాణాను అడ్డుకోవాలని చూస్తుంటే.. చైనా దానికి వ్యతిరేకంగా ఇరాన్‌కు అండగా నిలబడుతోంది. ఒకవేళ అమెరికా బలవంతంగా చైనా నౌకలను అడ్డుకుంటే.. అది రెండు అగ్రరాజ్యాల మధ్య ప్రత్యక్ష ఘర్షణకు దారితీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ ఇంధన అవసరాల్లో సింహభాగం ఈ జలసంధి నుంచే జరుగుతున్న తరుణంలో.. చైనా చేసిన ఈ హెచ్చరికలు అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374